



# కరపత్రం

SINCE 2014

బుధవారం ఏప్రిల్ 09 2025 | సంపుటి :0 | సంచిక :177 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## తెలంగాణలో 10-15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్.. ఏప్రిల్ 10 నుంచి 'స్లాట్ బుకింగ్'



హైదరాబాద్: తెలంగాణలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్ బుకింగ్' విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఏప్రిల్ 10 నుంచి రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ ప్రారంభమవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. తొలుత ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అమలు చేయనున్నట్లు తెలిపారు. స్లాట్ బుకింగ్‌తో 10 - 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి అవుతుందన్నారు.

# 15 నుంచి ఏపీలో ఇంటింటికీ 'మన మిత్ర' కార్యక్రమం

%అమరావతి: ఇంటింటికీ 'మనమిత్ర' కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి అమలు చేయనున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. వాట్సప్ గవర్నెన్స్‌పై సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. ప్రతి పౌరుడి ఫోన్‌లో 95523-00009 నంబర్‌ను సచివాలయ సిబ్బంది సేవ్ చేయనున్నారు. జిల్లా కలెక్టర్‌కు కార్యక్రమ పర్యవేక్షణ బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ప్రజలకు అవగాహన పెంచేలా ప్రత్యేక కరపత్రం, వీడియో సందేశాన్ని విడుదల చేసింది. తద్వారా ప్రతి ఒక్కరూ వాట్సప్ గవర్నెన్స్ ఉపయోగించుకునేలా ఐటీ, రియల్ టైం గవర్నెన్స్ శాఖ ఏర్పాట్లను పూర్తి చేసింది.

ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 250కి పైగా సేవలందిస్తోంది. జూన్ నెలకు 500కు పైగా సేవలందించే దిశగా చర్యలు చేపట్టింది. తదుపరి దశలో 1000కిపైగా సేవల కల్పించాలన్నది ప్రభుత్వ అంతిమ లక్ష్యంగా అధికారులు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా వాట్సప్ గవర్నెన్స్‌ను ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అందుబాటులోకి తెచ్చారు. మనమిత్ర ఇప్పటికే ప్రజాభిమానం చూరగొంటుందని అధికారులు తెలిపారు.





## హైదరాబాద్‌లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ భేటీ.. కీలక అంశాలపై చర్చ


2లో

- పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఛైర్మన్ అతుల్ జైన్ ఆధ్వర్యంలో సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించారు.

## దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసు.. దోషుల అప్పీళ్లను తిరస్కరించిన హైకోర్టు

- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసు లో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది.


2లో

# కేటీఆర్ జైలుకు వెళ్లకుండా కాపాడుతోంది రేవంతే



హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జైలుకు వెళ్లకుండా కాపాడుతోంది సీఎం రేవంత్‌రెడ్డేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. "నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై చెన్నైలో జరిగిన సమావేశానికి కేటీఆర్, రేవంత్ రెడ్డి కలిసే వెళ్లారు. హైదరాబాద్‌లో త్వరలో జరగబోయే సమావేశానికీ ఇద్దరూ కలిసే ప్లాన్ చేస్తున్నారు. ఆ ఇద్దరూ కలిసే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్, భారాస ఎంపీలతో ఓటు వేయించారు. పేజి 2లో

- తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పినా కేటీఆర్ తీరులో మార్పు లేదని విమర్శ.
- కేటీఆర్, రేవంత్ కలిసి బీజేపీకి వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు.
- హెచ్‌సీయూ భూములపై సీబీఐ విచారణకు సిద్ధమా? అని సవాల్.
- భూదందా, అవినీతి విషయాల్లో మోదీ సర్కార్ ఉక్కుపాదం మోపుతుందని హెచ్చరిక.

## జీరో శాతానికి పడిపోయిన జీఎస్టీ వృద్ధిరేటు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్ : జీఎస్టీ వృద్ధిరేటు జీరో శాతానికి పడిపోవడంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2025 మార్చి నెల అధికారిక గణాంకాలను పరిశీలిస్తే భట్టి విక్రమార్క వాదనలు పూర్తిగా అవాస్తవమని తేలిపోయింది. మా సలహాలు, హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇంత తక్కువ జీఎస్టీ వృద్ధి ఇప్పటి వరకు ఎప్పుడూ నమోదు కాలేదు అని హరీశ్‌రావు తెలిపారు. పేజి 2లో



# అనుముల ఇంటెలిజెన్స్‌తో రాష్ట్రానికి ప్రమాదం



ఏఐ అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదని, అనుముల ఇంటెలిజెన్స్ అని, ఈ అనుముల ఇంటెలిజెన్స్‌తో రాష్ట్రానికి ప్రమాదమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటుకై కవిత మంగళవారం ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో చాలా ప్రమాదముందని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని, వాస్తవానికి అనుముల ఇంటెలిజెన్స్‌తోనే రాష్ట్రానికి ప్రమాదమని వ్యాఖ్యానించారు. పేజి 2లో

## 1000 పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్..

# 22,500 ఎగువకు నిఫ్టీ

**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1089, నిఫ్టీ 374 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.**

ముంబయి: ట్రంప్ టారిఫ్ దెబ్బతో గత సెషన్‌లో కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు మంగళవారం పుంజుకున్నాయి. సుంకాల విషయంలో ప్రపంచ దేశాలతో అమెరికా చర్చలకు సిద్ధమన్న సంకేతాలతో ఆసియాతో పాటు మన మార్కెట్లూ రాణించాయి. ఈసారి ఆర్‌బీఐ నుంచి మరో 25 బేసిస్ పాయింట్ల వడ్డీ రేట్ల కోత ఉండొచ్చన్న అంచనాలు కూడా కలిసొచ్చాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఓ దశలో 1600 పాయింట్లకు పైగా రాణించగా.. నిఫ్టీ కూడా 22,600 ఎగువకు చేరింది. ఆఖర్లో అమ్మకాల కారణంగా లాభాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. ఉదయం సెన్సెక్స్ 74,013.73 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,137.90) లాభాల్లో ప్రారంభమైంది.


2లో

## విచారణకు సహకరించాలి.. క్రిశాంక్‌కు హైకోర్టు ఆదేశం


2లో

- భారాస నేత మన్నె క్రిశాంక్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. కంచ గచ్చిబౌలి భూముల ఘటనలో నకిలీ వీడియోలు వైరల్ చేశారని పోలీసుల ఆయనపై కేసు నమోదు చేశారు.

## వరంగల్‌లో నేనే పెద్ద లీడర్‌ను .. అందుకే నన్ను టార్గెట్ చేస్తున్నరు



వరంగల్ లో తాను పెద్ద లీడర్ ను కాబట్టే తనను టార్గెట్ చేస్తున్నారని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎమ్మెల్సీ గా సుదీర్ఘంగా పనిచేసిన సీనియర్ లీడర్ గా తనను టార్గెట్ చేయడం సహజమన్నారు కడియం శ్రీహరి.

తన 30 ఎండ్ల రాజకీయ జీవితంలో ఒక్క అంగుళం భూమి కూడా కబ్జా చేయలేదన్నారు. తాను దేవునూరు అటవీ భూమిని అక్రమించినట్టు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే తన ఇంట్లో పల్లా, రాజయ్య ఇద్దరూ గులాంగిరి చేయాలన్నారు. పేజి 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం ఏప్రిల్ 09 2025

# సంపాదకీయం

## కేంద్రం తగ్గాలి.. రాష్ట్రాలు పెరగాలి

కాలస్పృహలేని దేశంగా భారత్‌ను పాశ్చాత్య మేధావులు ఒకప్పుడు వర్ణించారు. సమాజంలో జరిగే మార్పులను క్రమపద్ధతిలో నమోదుచేసి ముందు తరాలకు అందించాలన్న తపన మనకు చాలా తక్కువని చెప్పటమే వారి ఉద్దేశం. పాశ్చాత్య చరిత్రలోలాగా లౌకిక విశేషాలను అక్షరబద్ధం చేసే అలవాటు మనకు ఎక్కువగా లేని మాట నిజమే! చరిత్రలో ఏ సంఘటనకైనా కాలనిర్ణయం చేయటం మనకు కత్తిమీద సామే! దానికి కారణాలు అనేకం. పాత చరిత్రను కాసేపు పక్కనబెట్టి సమకాలీన రాజకీయాలను గమనిస్తే మరో విశిష్టత కనిపిస్తుంది. అదే కాలయాపన! అవసరమైన విషయాలపై వెంటనే మనం దృష్టిపెట్టం. రాజ్యాంగం వచ్చిన పదేళ్లలో అందరినీ అక్షరాస్యులను చేయాలనుకున్నాం. చేయలేకపోయాం. అంటరానితనాన్ని సంపూర్ణంగా రూపుమాపాలనుకున్నాం. దాన్నీ చేయలేకపోయాం. ఇలా ఒకటీరెండూ కాదు.. మన కాలయాపనలు గురించి చాలా ఉదాహరణలు ఇవ్వొచ్చు. వీటిల్లో ఒకటి ఇప్పుడు మన రాజకీయాలను ఊపేస్తోంది.

పదేళ్లకొకసారి జనాభా సేకరణచేసి లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించాలని రాజ్యాంగ నిబంధన ఉన్నా 50ఏళ్లపాటు కాలయాపన చేశాం. రాజకీయ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అప్పటి ప్రభుత్వాలు దాన్నే పరిష్కారం అనుకున్నాయి. ఇప్పుడు కూడా కాలయాపన సృష్టించిన సవాళ్లను ఎదుర్కోవటం కంటే మళ్లీ పాతదారి తొక్కాలనే వాదన కూడా వినిపిస్తోంది. మరో పాతికో, యాభై ఏళ్లో పునర్వ్యవస్థీకరణను వాయిదా వేసినంత మాత్రాన సమస్య పరిష్కారం అయిపోదు. నియోజకవర్గాల సంఖ్యను యథాతథంగా ఉంచటం వల్ల రాష్ట్రాల మధ్య నెలకొన్న రాజకీయ అసమానతలు తొలగిపోవు. ఆర్థికంగా ముందంజలో ఉన్న రాష్ట్రాల ఆదాయాన్ని వెనుకబడిన రాష్ట్రాలకు ఎంతకాలం తరలిస్తారన్న ప్రశ్నలు ఇప్పటికే బలంగా వినిపిస్తున్నాయి. 'మేం ఇచ్చేదెంత? మాకు వచ్చేదెంత?' అనే ప్రశ్నలు రాజకీయాల్లో సర్వసాధారణమైపోయాయి. కుటుంబ నియంత్రణ లక్ష్యాలను సాధిస్తే ఆదాయంలో కోతలు వేస్తారా అంటూ నిలదీయటం నిత్యకృత్యమైంది. ఉత్తరాది వెనుకబాటు భారాన్ని దక్షిణాది ఎందుకు మోయాలని అడగటానికి సంశయించటం లేదు.

ఎన్నికల్లో లబ్ధి కోసమేనంటూ ఈ విమర్శలను కొట్టేయటం తేలిక. ప్రాంతీయ పార్టీలే వాటిని చేస్తున్నాయని ఆక్షేపించటమూ సులువే. కానీ సమస్య లోతుల్లోకి వెళ్లిచూస్తే ఈ విమర్శలను నిర్హేతుకమైనవిగా భావించలేం. రాష్ట్రాల మధ్య అసమానతలను కాదనలేం. వాటిని పరిష్కరించకుండా ఉత్తర%-%దక్షిణాదుల మధ్య నెలకొన్న భేదభావనలను పోగొట్టలేం.

రాజకీయ ఆధిపత్యం ఆర్థిక అంశాలను ప్రభావితం చేస్తుంది. చట్టసభల్లో సంఖ్యాబలం రాజకీయ ఆధిపత్యాన్ని నిర్ణయిస్తుంది. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణతో రాష్ట్రాల బలాలు చట్టసభల్లో తారుమారైతే.. ప్రాంతాల ఆధిపత్యంలోనూ తీవ్రమార్పు వస్తుంది. హిందీ రాష్ట్రాలకు అధికాధిపత్యం ఉందన్న భావన ఇప్పటికే బలంగా నాటుకుంది. ఇతర మార్పుల జోలికి వెళ్లకుండా కేవలం జనాభా ప్రాతిపదికగా వివిధ రాష్ట్రాల్లోని నియోజకవర్గాల సంఖ్యలో మార్పులు తెస్తే ఉత్తరాది ఆధిపత్యం మరింత పెరుగుతుందన్న భయమూ ఉంది. దీన్ని నివారించి రాష్ట్రాల మధ్య సమతూకం ఉండేలా చూడటమే పెద్ద సవాలుగా మారింది.పునర్వ్యవస్థీకరణపై దక్షిణాది రాష్ట్రాల నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నా ఇంతవరకూ కేంద్ర ప్రభుత్వం తన ఆలోచన ఏమిటో స్పష్టంచేయలేదు. కొవిడ్ పేరుతో వాయిదావేసిన జనాభా లెక్కల సేకరణ ఎప్పుడు మొదలుపెడతారో వెల్లడించలేదు. జనాభా ఆధారంగా మాత్రమే పునర్వ్యవస్థీకరణ చేపడితే ఒప్పుకొనేది లేదని దక్షిణాది నేతలు చేస్తున్న ప్రకటనలపై కేంద్ర మంత్రులు అప్పుడప్పుడూ స్పందిస్తున్నారు. తమిళనాడు ఒక్క లోక్‌సభ స్థానాన్నీ కోల్పోదని హోంమంత్రి అమిత్‌షా స్పష్టంచేశారు. అదే నిజమైతే లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య మొత్తంగా పెరగాలి.నియోజకవర్గాల పెంపు నిజమైతే దానికి అనుసరించే సూత్రం ఏమిటన్న ప్రశ్న వస్తుంది. అందుకు ఉన్న రాజ్యాంగ నిబంధనలు ఏమిటి? వాటికి అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ చేపడితే వివాదాలు సమసిపోతాయా? రాష్ట్రాల మధ్య చిచ్చుకు కారణమవుతున్న ఆదాయ పంపిణీలో అసమానతలు అంతమవుతాయా? అన్న ప్రశ్నలూ తలెత్తుతాయి. వీటిని సమగ్రంగా విశ్లేషించటం ఇటీవలే మొదలైంది. జెమీ హింట్‌సన్, మిలన్ వైష్ణవ్ 2019లో ఈ సమస్యపై రాసిన వ్యాసం ఆధారంగా ఇప్పటికీ వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఆ తర్వాత 2023లో శ్రుతి రాజగోపాలన్ మరికొన్ని అదనపు విషయాలను విశ్లేషించారు. రాజ్యాంగంలో ప్రాతినిధ్యం ఎలా ఉండాలో చెబుతూ కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలు చేశారు.లోక్‌సభ సీట్ల పంపకం రాజ్యాంగంలోని 81, 82 అధికరణాలను అనుసరించి జరగాలి. జనాభా దామాషాను బట్టి లోక్‌సభ సీట్లను రాష్ట్రాల మధ్య పంచటమే కాదు.. ఓటర్ల సంఖ్య రీత్యా ఆ సీట్లు సమానస్థాయిలో ఉండాలని కూడా ఆ అధికరణాలు నిర్దేశించాయి. ఒక ఓటుకు ఒక విలువ సూత్రం ప్రకారం ఆ నిబంధనలను పొందుపరచారు. ప్రస్తుతం మనకు 20 లక్షలలోపు ఉన్న నియోజకవర్గాలూ ఉన్నాయి. 40 లక్షల వరకూ ఓటర్లు ఉన్నవీ కనపడతాయి. అంటే ఓటు విలువలో సమానత్వం లేదు.1971 నాటి జనాభా లెక్కల ప్రకారం చేసిన పునర్వ్యవస్థీకరణ ఆధారంగానే ప్రస్తుత లోక్‌సభ, శాసనసభ సీట్లు ఉన్నాయి. ఆ తర్వాత ఆ ప్రక్రియ నిలిచిపోయింది. 1976లో ఒకసారి, 2002లో మరోసారి 25 ఏళ్ల చొప్పున పునర్వ్యవస్థీకరణపై నిషేధం విధించారు. 2026 తర్వాత చేపట్టబోయే జనాభా లెక్కలను అనుసరించి మాత్రమే పునర్వ్యవస్థీకరణను చేపట్టాలని 84వ రాజ్యాంగ సవరణ(2002) నిర్దేశించింది. జనాభా సేకరణను త్వరలో చేపట్టినా తుది లెక్కలు రావటానికి రెండేళ్లైనా పట్టొచ్చు. ఏ జనాభా లెక్కలు ఆధారంగా పునర్వ్యవస్థీకరణను చేపట్టాలన్నది 84వ రాజ్యాంగ సవరణకు ప్రభుత్వం ఇచ్చే వ్యాఖ్యానమే కీలకంగా ఉంటుంది. ప్రభుత్వం కావాలనుకుంటే సీట్లల్లో మార్పులను 2031 జనాభా సేకరణ లెక్కలు వచ్చేదాకా వాయిదానూ వేయొచ్చు.పెరిగిన జనాభా లెక్కలను తీసుకుని పునర్వ్యవస్థీకరణ చేస్తే మార్పులు తీవ్రంగానే ఉంటాయి. ఉదాహరణకు 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాలను సర్దుబాటు చేస్తే దక్షిణాది రాష్ట్రాలు కోల్పోయేది ఎక్కువని అయిదేళ్ల కిందటే జెమీ హింట్‌సన్, మిలన్ వైష్ణవ్ వివరించారు. హిందీ రాష్ట్రాలు బాగా లబ్ధిపొందుతాయనీ తేల్చారు. పైన ఇచ్చిన పట్టిక చూస్తే ఈ తేడాలు స్పష్టంగా కనపడతాయి. దక్షిణాది రాష్ట్రాలు 18 స్థానాలు కోల్పోతాయి. ఇక ఈ ఏడాదే (2026) పునర్వ్యవస్థీకరణ జరిగితే లాభనష్టాలు ఇంకా ఎక్కువగా ఉంటాయి. అప్పుడు దక్షిణాది 26 సీట్లను కోల్పోతుంది. హిందీ రాష్ట్రాలకు అదనంగా 35 సీట్లు చేరతాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో మాత్రం ఒక్కోసీటు మాత్రం తగ్గుతుంది. మొత్తంమీద బీజేపీకి పరిస్థితి అనుకూలంగా మారుతుంది.పునర్వ్యవస్థీకరణతో ప్రస్తుతం ఉన్న సీట్లను ఏ రాష్ట్రమూ కోల్పోకూడదన్న లక్ష్యంతో 2011 జనాభా లెక్కల ఆధారంగా కసరత్తు చేస్తే మొత్తం సీట్లను 718కి పెంచాల్సి వస్తుంది. ఇక 2026 జనాభాని పరిగణనలోకి తీసుకుంటే పెరిగే సీట్లు 848 అవుతాయి. అప్పుడు కేరళ మినహా అన్ని రాష్ట్రాలకు సీట్లు పెరుగుతాయి.

## విచారణకు సహకరించాలి.. క్రిశాంక్‌కు హైకోర్టు ఆదేశం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: భారాస నేత మన్నె క్రిశాంక్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. కంచ గచ్చిబౌలి భూముల ఘటనలో నకిలీ వీడియోలు వైరల్ చేశారని పోలీసుల ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని క్రిశాంక్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. విచారణకు సహకరించాలని ఆయన్ను ఆదేశించింది. కొణతం దిలీప్‌నకు నోటీసులు జారీ చేయాలని పోలీసులను ఆదేశించి.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.ఒకే ఘటనపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు వెల్లడించారు. రాజకీయ దురుద్దేశంతోనే కేసులు పెట్టారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో కంచ గచ్చిబౌలి భూముల ఘటనపై AI వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేసి వైరల్ చేశారని.. సీఎంపై అనుచిత పోస్టులు పెట్టారని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు.

## వరంగల్‌లో నేనే పెద్ద లీడర్‌ను .. అందుకే నన్ను టార్గెట్ చేస్తున్నరు

మొదటిపేజీ తరువాయి

ఉప ఎన్నికలు వస్తే రానివ్వండి.తనపై తప్పుడు ఆరోపణలు చేసినందుకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు కడియం. లేదంటే తాను తీసుకోబోయే చట్టపరమైన చర్యలకు పల్లా, రాజయ్య సిద్ధంగా ఉండాలన్నారు. ఉప ఎన్నికలు వచ్చినా ఎదుర్కోవడానికి సిద్దంగా ఉన్నానని చెప్పారు కడియం శ్రీహరి.మీడియాతో మాట్లాడిన కడియం శ్రీహరి.. దేవనూరు అటవీ భూములను నా కుటుంబ సభ్యులు కబ్జా చేశారని తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నారు. ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే రాజయ్య నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. రైతుల పట్టా భూములను కాపాడాలని ప్రయత్నాలు చేస్తుంటే నాపై కబ్జా ఆరోపణలు చేస్తున్నారు. నిరాధార వార్తలపై వివరణ ఇవ్వాలంటే నాకే సిగ్గనిపిస్తోంది. ఆధారాలు ఉంటే ప్రజల ముందు పెట్టాలి.

బీఆర్ఎస్ ఛానెల్స్ మాత్రమే నాపై ఆరోపణలు చేస్తున్నాయి. నా మంచి తనాన్ని తక్కువగా అంచనా వేయొద్దు. 30 యేండ్ల రాజకీయ జీవితంలో గుంట భూమి కూడా కబ్జా చేయలేదు. దేవగిరి గుట్టల చుట్టూ ఆరు గ్రామాలు ఉన్నాయి. 1967లో సుమారు 3750 ఎకరాల స్థలాన్ని రిజర్వ్ ఫారెస్ట్ గా ప్రకటించాలని డ్రాఫ్ట్ సిద్ధం చేసారు. ఆ డ్రాఫ్ట్ పై ఇప్పటివరకు నోటిఫికేషన్ జారీ చేయలేదు. ఫారెస్ట్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ లో లేని పట్టా భూములను సైతం ఫారెస్ట్ అధికారులు తమ ఆధీనంలో ఉంచుకున్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలను ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేస్తున్నారు. రైతుల కోసం కలెక్టర్ వద్దకు వెళ్లి జాయింట్ సర్వే చేయాలని కోరాను. రైతుల భూములు రైతులకు దక్కాలని పోరాటం చేస్తున్నాను. భూములను కబ్జా చేయాలని కాదు అని అన్నారు.

## జీరో శాతానికి పడిపోయిన జీఎస్టీ వృద్ధిరేటు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు ఫైర్

మొదటిపేజీ తరువాయి

దేశీయ వృద్ధిరేటుతో పోలిస్తే రాష్ట్రం చాలా వెనుకబడి ఉంది. దేశ వ్యాప్తంగా సగటు జీఎస్టీ వృద్ధిరేటు 10 శాతం ఉంది. 2024-25లో రాష్ట్రం కేవలం 5.1 శాతం వృద్ధి సాధించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జీఎస్టీ వృద్ధి 12.3 శాతమన్న అసెంబ్లీలో భట్టి విక్రమార్క వ్యాఖ్యలు అవాస్తవమని తేలాయి. ఆర్థిక మంత్రి సభను మాత్రమే కాదు.. రాష్ట్ర పౌరులను మోసం చేశారు. కొవిడ్ వేళ తప్ప ఇంత తక్కువ జీఎస్టీ వృద్ధి ఎన్నడూ నమోదు కాలేదు. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం.. నిర్లక్ష్యానికి నిదర్శనం. రాష్ట్ర వృద్ధి రేటు తగ్గడానికి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణం. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఖర్చు సామర్థ్యం తగ్గిపోయింది. హైడ్రా, మూసీ ప్రక్షాళన వంటి తప్పుడు విధానాలతో పెట్టుబడులు రావడం లేదు. ప్రజల చేతిలో డబ్బు లేకపోతే వినియోగం ఎలా పెరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అంకెల గారడీతో కాకుండా వాస్తవాల ఆధారంగా పాలన అందించాలని హరీశ్‌రావు సూచించారు.

## అనుముల ఇంటెలిజెన్స్‌తో రాష్టానికి ప్రమాదం

మొదటిపేజీ తరువాయి




అనుముల ఇంటెలిజెన్స్ రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తోందని కవిత అన్నారు. అనుముల ఇంటెలిజెన్స్ పక్కకు జరిగితే తప్ప రాష్ట్రం బాగుపడే పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు. ప్రజలను మోసం చేయడమే అనుముల ఇంటెలిజెన్స్ పని అని విమర్శించారు. అనుముల ఇంటెలిజెన్స్‌ను వాడి కులగణనను తప్పుదోవ పట్టించారని, బీసీకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. సర్వే వివరాలను అసెంబ్లీలో పెట్టకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించి అధ్యయనం చేసిన తర్వాత రిజర్వేషన్ ఇస్తారట అని ఎద్దేవా చేశారు.బీఆర్ఎస్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆ ధైర్యం ఎందుకు లేదని కవిత ప్రశ్నించారు. 2011లో యూపీఏ హయాంలో దేశంలో కులగణన చేసినా ఇప్పటికీ ఆ వివరాలు వెల్లడించలేదని అన్నారు. ఆ వివరాలను వెల్లడించేలా కేంద్రంపై ఒత్తిడి చేయాలని, అందుకు తాము కూడా కలిసి వస్తామని చెప్పారు. అదేవిధంగా కాంగ్రెస్ నేతలలాగా తాము ఢిల్లీలో దొంగ దీక్షలు చేయబోమని, అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నిరవధికంగా దీక్షకు కూర్చుంటామని అన్నారు.చట్టసభలు బిల్లులను ఆమోదించి నాలుగు వారాలైందని, ప్రస్తుతం ఆ బిల్లుల స్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. ఆ బిల్లులు గవర్నర్ వద్దనే పెండింగ్‌లో ఉన్నాయా.. లేదంటే రాష్ట్రపతికి పంపించారా..? అని నిలదీశారు. బిల్లుల ఆమోదం తర్వాత అన్ని పార్టీలను ప్రధాని వద్దకు తీసుకెళ్తామని సీఎం అన్నారని, కానీ ఇప్పటివరకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లలేదని అరోపించారు. బీజేపీతో రేవంత్‌రెడ్డికి లాలూచీ ఉన్నదని, బీజేపీని కాపాడటం కోసమే కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లడం లేదని ఆరోపణలు చేశారు.అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లడానికి బదులు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో తుఫేల్ ధర్నా చేశారని, ఆ ధర్నాకు రాహుల్ గాంధీ వస్తారని ఊదరగొట్టారని, కానీ చివరికి ఆయన రాలేదని కవిత చెప్పారు. ఢిల్లీలో కూడా ముఖ్యమంత్రి తెలుగులో మాట్లాడారని, ఢిల్లీ పెద్దలపై ఒత్తిడి తేవాలంటే వాళ్లకు అర్థమయ్యే భాషలో చెప్పాలని అన్నారు. రేవంత్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే కులగణన వేదికను అసెంబ్లీలో పెట్టాలని,ఏప్రిల్ 11లోగా పూలే విగ్రహం ఏర్పాటుపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.దేశంలో తరతరాలుగా వెనుకబడ్డ జాతులకు న్యాయం జరగాలని కాంక్షించిన వ్యక్తి పూలే అని, ఆయన తనకు గురువని అంబేద్కర్ చెప్పారని గుర్తుచేశారు. మహిళల కోసం పాఠశాలలను ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి పూలే అని, కులవివక్షకు వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పోరాటం చేశారని, అసెంబ్లీలో పూలే విగ్రహం పెడితే సమాజం స్ఫూర్తి పొందుతుందని కవిత అన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా విగ్రహం కోసం పోరాటం చేస్తామని, ధైర్యంగా ముందుకే వెళ్తాము తప్ప, వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదన్నారు.ఏప్రిల్ 11న పూలే విగ్రహంపై ప్రభుత్వం ప్రకటన చేయాలని అన్నారు. రిజర్వేషన్ల పెంపునకు మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలని డిమాండ్ చేసి సాధించామని, ఇది తెలంగాణ జాగృతి, యూపీఎఫ్, బీఆర్ఎస్ పార్టీ విజయమని చెప్పారు.

### 1000 పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్..

## 22,500 ఎగువకు నిఫ్టీ

మొదటిపేజీ తరువాయి

రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 74,859.39 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1089.18 పాయింట్ల లాభంతో 74,227.08 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 374.25 పాయింట్ల లాభంతో 22,535.85 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.86.27గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్ గ్రిడ్ మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 100, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్సులు కూడా 2 శాతం మేర లాభాల్లో ముగిశాయి.

### అమెరికాతో అమీతుమీకి చైనా మార్కెట్లు సిద్ధం..?

ఇక, ఆసియా-పసిఫిక్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. జపాన్ నిక్కీ 5.68 శాతానికి పైగా లాభపడగా.. హాంగ్‌కాంగ్, షాంఘై మార్కెట్లు ఒకటిన్నర శాతం లాభపడ్డాయి. సింగపూర్, తైవాన్, జకర్తా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో ప్రారంభ అయ్యాయి. డోజోన్స్ ఫ్యూచర్స్ 2 శాతం మేర లాభాల్లో ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3020 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

### కారణాలు ఇవీ..

సుంకాలపై చర్చకు కొన్ని దేశాలు ముందుకొచ్చాయని ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపింది. ట్రంప్ కూడా కాస్త వెనక్కి తగ్గుతారనే అంచనాలున్నాయి. దీనివల్ల వాణిజ్య యుద్ధ ఆందోళనలు తగ్గుతాయనే సంకేతాలు సూచీల సెంటిమెంట్‌ను బలపర్చాయి. చైనా, వియత్నాం తదితర దేశాలతో పోల్చితే ట్రంప్ సుంకాల వల్ల కలిగే నష్టం మనదేశానికి తక్కువనే అంచనాలు మదుపర్ల ఆందోళనలకు కాస్త ఊరటనిచ్చాయి.

అటు ముడిచమురు ధర తగ్గుముఖం పట్టడం కూడా మార్కెట్ల ర్యాలీకి ఓ కారణంగా మారింది. కనిష్ఠాల వద్ద కొనుగోళ్లు సూచీలకు అండగా నిలిచాయి.

ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బుధవారం (ఏప్రిల్ 9న) నిర్ణయాలు వెలువడనున్నాయి. 25 బేసిస్ పాయింట్లు తగ్గించడం ద్వారా దేశీయంగా వృద్ధికి ఊతం లభిస్తుందని మదుపర్లు భావిస్తున్నారు.

అమెరికాలో 10 ఏళ్ల బాండ్ల రాబడులు కూడా ఫిబ్రవరితో పోలిస్తే 4.5 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. 2 ఏళ్ల బాండ్ల రాబడులు సైతం 3.715 శాతానికి పడిపోయాయి. అమెరికా డాలర్ ఇండెక్స్ 102.92కి తగ్గడం వంటివి భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు పాజిటివ్‌గా మారాయి.

## కేటీఆర్ జైలుకు వెళ్లకుండా కాపాడుతోంది రేవంతే

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఇద్దరూ కలిసే మజ్లిస్ పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు సిద్ధమయ్యారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రేవంత్‌ను కాపాడేందుకే కేటీఆర్ భారాస అభ్యర్థిని బరిలోకి దించలేదు. తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పినా కేటీఆర్ బుద్ధి మారలేదు. కేటీఆర్, రేవంత్ ఏకమై భాజపాను దెబ్బతీసేందుకు మళ్లీ కుట్రలు చేస్తున్నారు. హెచ్‌సీయూ భూములపై సీబీఐ విచారణకు సిద్ధమా? భూదందా, అవినీతిపరులపై ఉక్కుపాదం మోపే మోదీ సర్కార్ కేంద్రంలో ఉంది" అని బండి సంజయ్ పేర్కొన్నారు.


## హైదరాబాద్‌లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ భేటీ.. కీలక అంశాలపై చర్చ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు అథారిటీ హైదరాబాద్‌లో భేటీ అయింది. ప్రాజెక్టు అథారిటీ ఛైర్మన్ అతుల్ జైన్ ఆధ్వర్యంలో ఈ సమావేశం కొనసాగుతోంది. తెలంగాణ ఈఎన్సీ అనిల్, ఏపీకి చెందిన ఇద్దరు చీఫ్ ఇంజినీర్లు భేటీలో పాల్గొన్నారు. పోలవరం పనుల పురోగతి, అంచనా వ్యయం, నిధులు, ఇతర అంశాలపై వారు చర్చిస్తున్నట్లు సమాచారం. తెలంగాణ ప్రాంతంలో ముంపును గుర్తించే అంశం, పోలవరం బ్యాక్ వాటర్స్ ప్రభావం ఉండే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చిస్తున్నారు.పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఉన్న అభ్యంతరాలను తెలంగాణ అధికారులు మరోమారు ఈ భేటీలో లేవనెత్తారు. పోలవరం పూర్తి నిల్వ సామర్థ్యం గురించి సమావేశంలో తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. కిన్నెరసాని, ముర్రేడువాగు, ఇతర ప్రవాహాల చర్యల గురించి ప్రస్తావించారు. ఖమ్మం పట్టణం, భద్రాచలం పట్టణాలపై పోలవరం బ్యాక్ వాటర్స్ ప్రభావం, రామాలయం వద్ద నీటిమట్టం, మణుగూరు భారజల ప్లాంట్ వద్ద వాటర్ లెవెల్స్ అంశంపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని రాష్ట్ర అధికారులు మరోసారి అథారిటీని కోరారు. గత ఏడాది వరదల ప్రభావంతో ముంపునకు గురైన నేపథ్యంలో అధ్యయనం సమగ్రంగా జరగాలన్నారు. పోలవరం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేస్తే ఆ ప్రభావం తెలంగాణపై ఏ మేరకు ఉంటుందనే విషయాలపై స్పష్టత రావాలని అథారిటీని తెలంగాణ అధికారులు కోరారు.

## దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసు.. దోషుల అప్పీళ్లను తిరస్కరించిన హైకోర్టు

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసు లో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఎన్ఐఏ కోర్టు విధించిన ఉరిశిక్షను రద్దు చేయాలంటూ ఐదుగురు దోషులు దాఖలు చేసిన అప్పీళ్లను ఉన్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. ఎన్ఐఏ కోర్టు తీర్పును హైకోర్టు సమర్థించింది.

2013 ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్టాపులో, మిర్చిపాయింట్ వద్ద జరిగిన జంట పేలుళ్లలో 18 మంది మృతి చెందగా, 131 మంది గాయపడ్డారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మహమ్మద్ రియాజ్ అలియాస్ రియాజ్ భత్కల్ పరారీలో ఉండగా, మిగిలిన ఐదుగురు నిందితులకు ఎన్ఐఏ కోర్టు ఉరిశిక్ష విధిస్తూ 2016 డిసెంబరు 13న తీర్పు వెలువరించింది.ఉరిశిక్ష పడిన నిందితుల్లో అసదుల్లా అక్తర్ అలియాస్ హద్ది, జియా ఉర్ రహమాన్ అలియాస్ వఘాస్ అలియాస్ నబీల్ అహమ్మద్, మహ్మద్ తహసీన్ అక్తర్ అలియాస్ హసన్ అలియాస్ మోను, యాసిన్ భత్కల్ అలియాస్ షారూఖ్, అజాజ్ షేక్ అలియాస్ సమర్ ఆర్మాన్ తుండె అలియాస్ సాగర్ అలియాస్ ఐజాజ్ సయ్యద్ షేక్ ఉన్నారు. అనంతరం ఉరిశిక్ష ధ్రువీకరణ నిమిత్తం ఎన్ఐఏ కోర్టు తీర్పును హైకోర్టుకు నివేదించింది. దీంతోపాటు ఐదుగురు నిందితులు కింది కోర్టు తీర్పును రద్దు చేయాలని కోరుతూ అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధలతో కూడిన ధర్మాసనం సుమారు 45 రోజులపాటు సుదీర్ఘ విచారణ జరిపి తీర్పు వాయిదా వేసింది. నేడు ఎన్ఐఏ కోర్టు తీర్పును సమర్థిస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు హైకోర్టు తీర్పుపై బాధితులు హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం ఏప్రిల్ 09 2025

# జై బాపు జై భీం జై సంవిధాన్ నినాదంతో

# రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి

- **కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు**
- **1932 సం.లో పూనా పాక్ట్ ఒప్పందంలో దళితులకు,అణగారిన వర్గాలకు ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించే విషయంలో గాంధీ అభ్యంతరం చెప్పడంతో అంబేద్కర్ తీవ్రంగా నిరసన తెలిపాడు.**






అప్పటి నుండి అనేక విషయాల్లో గాంధీతో విభధించిన అంబేద్కర్ బాటలో భారత దేశ వ్యాప్తంగా అంబేద్కర్ వాదులు గాంధీని వ్యతిరేకించడం చేస్తున్నారు.ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ దళిత సంఘాలతో మైత్రి కొరకు జై బాపు జై భీం జై సంవిధాన్ అనే నినాదంతో దళిత ఓట్ల కొరకు అల్లుతున్న ఈ రాజకీయ సమీకరణా నినాదం పట్ల అన్ని అంబేద్కర్ సంఘాలు, దళిత సంఘాలు,అణగారిన వర్గాల సంఘాలు కాంగ్రెస్ అడుగులను అనుమానంతో చూస్తున్నాయి ఇదిలా ఉంటే .. రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ జువాడి నరసింహారావు అన్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట గ్రామం లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర అమ్మక్కపేట గ్రామ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు విచ్చేశారు. ఈ సందర్భంగా జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నర్సింగరావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అత్యంత పవిత్రమైనదిగా ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగంగా భావిస్తామని సార్వభౌమత్వ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగ నిర్మించుకోవడానికి సాంఘిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని ఆలోచన భావ ప్రకటనను అంతస్తులును అవకాశాల్లోనూ మానవత్వాన్ని కల్పించడానికి కులమాత ప్రాంత వర్మ లింగ ధనిక పేద లాంటి ఏ రకమైన భేదాలు లేకుండా అందరికీ సమాన హక్కులు బాధ్యతలు రాజ్యాంగ కల్పించిందని ఇటీవల పరిమాణాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ సమాజంలో అసాధ్యులే నెలకొల్పుతున్నాయని విభేదాలు సృష్టిస్తూ రాజకీయం మనగాడ కోసం విద్వేషాలు రెచ్చగొడుతున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో శాంతి అహింసను మూల సూత్రాలుగా మనకు బోధించే మహాత్ముడి స్ఫూర్తిగా, మనుషులంతా ఒకటే అంటూ రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు కల్పించడానికి డాక్టర్ బాబాసాహెబ్ ఆశయాలను అమలు చేస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి చిత్తశుద్ధితో అంకితభావంతో అహర్నిశలు కృషి చేయాలన్నారు. రాజ్యాంగాన్ని రచించింది కాంగ్రెస్ పార్టీ అని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, రాజ్యాంగాన్ని పరిరక్షించేది కూడా కాంగ్రెస్ పార్టీయేనన్నారు అలాంటి కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న జై బాబు జై భీమ్ జై సమ్మిదాన కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన ఇంటింటికి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కాబట్టి ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి గ్రామంలో ర్యాలీ నిర్వహించాలన్నారు కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేసే పార్టీ అని అన్నారు కాంగ్రెస్ పార్టీ చేపట్టి అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగాం రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దుదిగం గంగాధర్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు క్యాతం తిరుపతి రెడ్డి,మాజీ ఎంపీపీ నేరెల్ల దేవేందర్, రాజేశ్వర్ రెడ్డి, వార్డు మెంబర్లు ఫోరం అధ్యక్షుడు ఒద్దె సోమేష్,మాజీ మండల అధ్యక్షులు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి, గడ్డం శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచులు లక్కం నర్సక్క, లింగంపెల్లి గంగాధర్, నల్ల రమేష్,సోమ ప్రభాకర్ మాజీ ఎంపీటీసీ లు పొనకంటి వెంకట్,జలేశ్,మహేష్,ఏఎంసి డైరెక్టర్లు తిప్పిరీ అశోక్,దామెర శ్రీను, బూస రాజేశ్వర్, రావుల గణేష్,ముక్కెర వేణుగోపాల్ యాదవ్, వేముల శ్రీనివాస రావు,గడ్డం శంకర్ రెడ్డి,పెంట లింబద్రి, నాంపల్లి వెంకటాద్రి, కాస ప్రశాంత్,రెబ్బటి శేఖర్, మీబండి రాజేశ్, నల్ల రామరాజు, వాల్గొట్ నరేష్, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోరుట్లలో మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం

ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి మంగళవారం, ఏప్రిల్ 08:

### - ఐ.ఎం.ఏ మెగా హెల్త్ క్యాంపు విజయవంతం




కోరుట్ల పట్టణం లో నిన్న ఐ.ఎం.ఏ కమోగా, జమాతే ఇస్లామిక్ ఆర్గనైజషన్ కలిసి నిర్వహించిన మెడికల్ క్యాంపులో 1200 మంది పేషెంట్స్ కు పరీక్షలు నిర్వహించడం జరిగింది.దీనిలో ముఖ్యంగా కాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, బ్లడ్ టెస్ట్స్, బోన్ డెన్సిటీ టెస్ట్స్ నిర్వహించినారు. పరీక్షలు నిర్వహించిన రోగులకు కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగ్ రావు గారు ఉచితంగా మందులు పంపిణి చేశారు.ఇట్టి కార్యక్రమం కెమోగా ప్రెసిడెంట్ డా. స్వేతి అనూప్ రావు గారు కోరుట్ల కింగ్స్ గార్డెన్ లో ప్రారంభించిన తరువాత రోగులకు టెస్ట్స్ నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమం లో డా. అనూప్ రావు, డా. రాజేష్, డా.అనురాధ. డా. వేణుగోపాల్, డా. మనోజ్. డా.అన్వేష్, డా. ఇంద్రనీల్, డా. అనురాగ్, డా. రమేష్ మరియు ఐ.ఎం. ఏ డాక్టర్స్ అందరూ పాల్గొన్నారు.

## కార్యకర్తగా మారిన నాయకుడు

ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి మంగళవారం, ఏప్రిల్ 08 :

### - కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్ వాల్ రైటింగ్




కోరుట్ల మండలం యూసుఫ్ నగర్ గ్రామంలో ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ గారు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ నెల 27న వరంగల్ లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని స్వయంగా ఎమ్మెల్యే సంజయ్ గారు గోడపై వాల్ రైటింగ్ రాశారు..పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకను పురస్కరించుకొని ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను పార్టీ అభిమానులు,నాయకులు విజయవంతం చేయాలని కోరారు.కార్యకర్తలతో నాయకుడు కలిసి నడిస్తే పార్టీ పరుగెత్తుతుంది. ప్రతి పార్టీ బండికి కార్యకర్తలే ఇరుసులు.ఎన్నికల్లో డబ్బులు వెదజల్లి పనిచేయించుకునే ఏ పార్టీ నాయకులైనా కొద్ది కాలమే మెరిసి మాయమవుతారు.ఒక సాధారణ కార్యకర్తగా ఎమ్మెల్యే తమతో కలిసి ఇలా గోడ రాతలు రాసి మమేకమవ్వడంతో యూసఫ్ నగర్ గ్రామ బిఆర్ఎస్ కార్యకర్తల్లో ఒక ఉత్సాహం కనిపించింది.మేము కిరాయి మనుషులం కాదు. పార్టీ నిర్మాతలమనే గుర్తింపు దొరికిందని పార్టీ శ్రేణులు మురిసిపోవడం కనిపించింది.

## ఎంపీడీవో కు సమ్మె నోటీసు ఇచ్చిన గ్రామపంచాయతీ కార్మికులు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 8**



తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ సిఐటి అనుబంధం జమ్మికుంట మండల శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో భీమ్ సేనా కి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది కార్మికుల డిమాండ్బీ పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించాలి వేతనాలకు బడ్జెట్ కేటాయించాలి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలని పంచాయతీ సిబ్బందిని రెండవ పిఆర్సి లోనికి తీసుకోవాలని జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కేటా గిరిల వారిగా నియమించాలని పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని రిటైర్డ్ బెనిఫిట్ ఐదు లక్షలు ఇవ్వాలని పర్మినెంట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఈ డిమాండ్లతో రాష్ట్ర నాయకత్వం పలుమార్లు పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ని పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చిన పంచాయతీరాజ్ మంత్రి సమస్యలపై దృష్టి పెట్టడం లేదు పలుమార్లు ముఖ్యమంత్రి ని కూడా కలవడం జరిగింది అయినా కానీ మా సమస్యల పట్ల చొరవ చూపడం లేదు గత్యంతరం లేని పరిస్థితుల్లో కార్మికులు ఈనెల 19 తర్వాత ఏక్షిణమైన సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నామని కార్మికులు తెలియజేస్తున్నారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎండిగ రవీందర్రావు ప్రధాన కార్యదర్శి లడ్డానూరి కుమార్ కోశాధికారి మ్యకల్లమల రాము జిల్లా కార్యవర్గ సభ్యులు ఆసాల సారయ్య తిరుపతి రాజ కొమురయ్య మొగిలి సంపత్ సదానందం రమేష్ రవి స్వామి ఆదిరెడ్డి భద్రయ్య ఈ కార్యక్రమంలో 30 మంది గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

## లంచం తీసుకుంటూ ఏసీబీ చిక్కిన జమ్మికుంట ఐకెపి సీసీ సురేష్

**కరపత్రం జమ్మికుంట ఏప్రిల్ 8**





కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట పట్టణంలోని ఐకెపి కార్యాలయంలో ఏసీబీ డి.ఎస్.పి రమణమూర్తి ఆధ్వర్యంలో ఐకెపిలో పనిచేస్తున్న కమ్యూనిటీ కోఆర్డినేటర్ సురేష్ (10000) పదివేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఐకెపి కార్యాలయం కు కూడా అవినీతి మకిలి పట్టింది. వివరాల్లోకి వెళితే జమ్మికుంట మండలం లోని ఐకేపీ కార్యాలయంలో పెద్దంపల్లి గ్రామానికి చెందిన స్వప్న వి ఓ ఏ గా విధులు నిర్వహిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా జీతం డబ్బులు చెక్కు ఇవ్వాలని అడగగా, (20000 ) రూపాయలు లంచం ఇస్తే నే నీకు చెక్కు ఇస్తాను, అని అన్నారు అని స్వప్న తెలిపారు. కాగా నాలుగు వేల రూపాయలు ఇచ్చాను, అని వివరించారు. అయినా కూడా 15000 రూపాయలు ఇస్తేనే చెక్ పాస్ చేస్తా అని, లేకపోతే ఇవ్వడం కుదరదు అని సురేష్ అనగానే, నాకు వేరే మార్గం లేక మంగళవారం నాడు ( 10000 )రూపాయలు ఇస్తాను అని చెప్పగా, సురేష్ కూడా సరే అన్నారు అని తెలిపారు. వేరే గత్యంతరం లేక ఎసిబి వాళ్లను సంప్రదించడం జరిగింది అని స్వప్న అన్నారు. కాగా కొన్ని గవర్నమెంట్ కార్యాలయలు అక్రమాలకు అడ్డాగా మారాయి. చిన్నస్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు పనికో ధర నిర్ణయించి డబ్బులు దండుకోవడం నిత్యకృత్యంగా మారింది. కానీ అవినీతి చేప సురేష్ లంచం డిమాండ్ చేయడం తోనే స్వప్న ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో, ఇ సురేష్ అవినీతి బండారం బయటపడింది. స్వప్న నుంచి 10 వేలు లంచం తీసుకుంటూ మంగళవారం నాడు అవినీతి నిరోధక శాఖ అధికారులకు అడ్డంగా ఇ అవినీతి ( చేప ) సురేష్ దొరికిపోయారు.

## గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్

**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఏప్రిల్ 08.**

మంగళవారం రామగిరి మండలంలోని వకీల్ పల్లి ప్లాట్స్ లో బంజారా కులస్తులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుగులోత్ ప్రవీణ్ కుమార్ అధ్వర్యంలో బొగ్ బండార్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్,రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొడ్డ బాపన్న,పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య,మంథని నియోజవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బర్ల శ్రీనివాస్ ముదిరాజ్,రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కండే పోశం,రామగిరి మండల కాంగ్రెస్ నాయకులు హాజయ్యారు.ఈ సందర్భంగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మాట్లాడుతూ గిరిజన సామాజిక వర్గం అభివృద్దిలో సంత్ సేవాలాల్ మహారాజ్ పాత్ర చాలా కీలకం నిజాం సామ్రాజ్యాన్ని తన ఆధ్యాత్మిక శక్తితో గడగడా లాడించి పేరీ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన క్రాంతివీరుడు సేవాలాల్ మహారాజ్ అని అన్నారు.బంజారా ప్రజలు అత్యంత విశ్వాసం పాత్రులు అని బంజారా ప్రజల్లో అత్యధిక మంది గూఢచార వ్యవస్థలో పనిచేసేవారు అని నిజాం సామ్రాజంలో గోల్కొండ కోటలో ప్రవేశించాలంటే భారీ తనిఖీల నడుమ లోపేట ప్రవేశానికి వదిలే వారు,వాటిలో ఒకటి ధార్వాజ పేరును బంజారా ధార్వాజగా పేరు పెట్టి ఎటువంటి తనిఖీలు నిర్వహించకుండా కోటలోనికి కేవలం బంజారా ప్రజలకు మాత్రమే ఇ అవకాశం ఉండేది అని అంతటి నమ్మకస్తులు ఈ బంజారా ప్రజలు అని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ కొనియాడారు.బంజారా ప్రజలు విద్య,వైద్య,ఆధ్యాత్మిక,వైజ్ఞానిక రంగంలో ముందుకు సాగాలని సూచించారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
బుధవారం ఏప్రిల్ 09 2025

# జై బాపు . జై భీమ్. జై సంవిధాన్. ప్రచారం

# శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**

కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టి వాడవాడలా తిరుగుతూ జై బాపు. జై భీమ్. జై సంవిధాన్ అభియాన్. కార్యక్రమాన్ని ప్రతిజ్ఞ బూని వార్డు లో ఈంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరిస్తూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ శ్రీరాములపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ప్రచారం ప్రారంభించడం జరిగిందన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా జై బాపు జై భీమ్. జై సంవిధాన్ . అనే కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. ఈ




కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అంబేద్కర్‌ను అవమానిస్తూ, రాజ్యాంగాన్ని కించపరిచేలా బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లు ఏవిధంగా వ్యవహరిస్తున్నాయో ప్రజలకు తెలియజేయడానికే ఈ కార్యక్రమం చేపట్టాం. ప్రతి వాడవాడలో ఇంటింటికి మన రాజ్యాంగ అవశ్యకతను తెలుపుతూ మహాత్మా గాంధీ. అంబేద్కర్ .




రాజ్యాంగాన్ని .చేత పట్టుకొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరకంగా నిరసనలు తెలిపి ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నాం.గాంధేయ మార్గంలో ఊరురా పాదయాత్ర లో జాతీయ జెండా తో మహాత్మా గాంధీ చిత్ర పటం అంబేద్కర్ చిత్రపటం భారత రాజ్యాంగం ప్రదర్శించి నిరసన వ్యక్తం చేస్తున్నాం.రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశమనగడ సాధ్యం అన్నారు. కేంద్రంలోని బిజెపి రాజ్యాంగ విలువలను కాలరాస్తూ మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తుందన్నారు.మతవాదుల నుండి దేశాన్ని కాపాడుకోవాలంటే మరోసారి గాందేయ మార్గంలో జై బాపూ జై భీమ్ జై సంవిధాన్ అభియాన్. పేరుతో గ్రామ గ్రామాన పాదయాత్రలు చేపట్టి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు అంబేద్కర్ గొప్పతనాన్ని చాటి చెప్పి మన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి అని కార్యక్రమంలో పాల్గొన్న వాళ్ళందరూ ప్రమాణం చేశారు. ఎస్సీ వర్గీకరణ చేసాం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేశాం వీటిని ప్రజల్లోకి తీసుకెళ్తూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 200 ల యూనిట్ల ఉచిత విద్యుత్తు ,500 కి గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు మేకల సురేష్ మండల అధ్యక్షులు పెద్ది కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి గూడెపు సారంగపాణి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్ ఓదెలు యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజు, సంతోష్ ,పద్మయ, రామస్వామి, రాజేశ్వరరావు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మాతృ సంస్థలోకి తానిపర్తి...



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది:**

రామగుండం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తానిపర్తి గోపాల్ రావు మాతృ సంస్థ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. మొదటినుంచి కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు అత్యంత సన్నిహితుడిగా ఉంటూ వస్తున్న గోపాలరావు 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల అనంతరం టిఆర్ఎస్ పార్టీలోకి చేరారు. రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలకు సుపరిచితుడుగా, అందరిని నవ్వుతూ ఆప్యాయంగా పలకరించే పేరు ఉన్న గోపాల్ అన్న ఎన్నికల అనంతరం టిఆర్ఎస్ పార్టీ నుంచి వైదొలిగారు. అప్పటినుంచి స్తబ్దతగా ఉన్న గోపాలరావు కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరుతారని అందరూ భావించారు. ఎట్టకేలకు మంగళవారం రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయనకు కండువా కప్పి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. గోపాలరావు రాకతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నెలకొంది. అలాగే రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గోపాలరావుకు అభినందనలు తెలిపారు.

## గాంధీ అంబేద్కర్ ఆశయాలను భావి తరాలకు తెలియజేయాలి..

**- రాజ్యాంగ పరిరక్షణ పోరాటంలో ప్రతీ ఒక్కరు కలసి రావాలి..**

**కరపత్రం ప్రతినిధి ఇల్లంతకుంట ఏప్రిల్ 8**

ఏఐసీసీ పిలుపు మేరకు హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు దిశా నిర్దేశంతో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర మండల పార్టీ అధ్యక్షులు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో శ్రీరాములపల్లి గ్రామంలో మొదలుకొని ఇల్లందకుంట వరకు పాదయాత్ర కొనసాగింది. మండలంలో 18 గ్రామాలలో ప్రతీ గ్రామంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర క్షేత్ర స్థాయిలో విజయవంతం చేసుకుని ఇల్లందకుంట మండల కేంద్రంలో ముగింపు పాదయాత్ర ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం తీసుకు వచ్చిన మహాత్మా గాంధీ ఆశయాలను మరియు ఎంతో కృషి చేసి రాజ్యాంగం రచించినటువంటి డాక్టర్






బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని ఈ కార్యక్రమాన్ని తలపెట్టడం జరిగిందన్నారు. బిజెపి పార్టీ ప్రజలని తప్పుదోవ పట్టిస్తూ ప్రజలని కుల మత ప్రాంతాలుగా విడగొడుతూ కుల చిచ్చులకి ప్రజలని ఉసి గొలుపుతూ దేశాన్ని చిన్నభిన్నం చేయడానికి మతోన్మాద విధానాన్ని అవలంబిస్తూ చేస్తున్నటువంటి వైఖరిని ఖండిస్తున్నాం అని తెలియజేస్తూ భారతదేశంలో ప్రతి ఒక్క పౌరునికి స్వేచ్ఛ స్వాతంత్రం సమానత్వం ప్రజాస్వామ్యంగా జీవించడానికి రాజ్యాంగం మనకి హక్కులను కల్పిస్తుంది దీన్ని జీర్ణించుకోలేని మతతత్వ పార్టీ అయినా బిజెపి పార్టీ రాజ్యాంగం సవరణ కుట్రతో రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు మళ్ళీ ప్రజలని వెట్టి చాకిరి చేసి బానిసలుగా చేయాలని ఆలోచిస్తూ పదేపదే మహనీయులని కించపరుస్తూ పార్లమెంట్ నిండు సభలో సైతం స్వాతంత్ర్య సమరయోధులను, జాతి పిత మహాత్మా గాంధీ ని, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ని వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ రాజ్యాంగానికి విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, వివిధ హెూదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా విభాగం నాయకురాళ్లు, ఎన్ఎస్ యూ ఐ నాయకులు, గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి అధికారులను కలిసిన ఆర్జీ త్రీ ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి

**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఏప్రిల్ 08.**

ఐ టి,ఇండస్ట్రియల్ మినిస్టర్ శ్రీధర్ బాబు, మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్,ఎస్ సి ఎం ఎల్ యు - ఐ ఎన్ టి యు సి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం కొత్తగూడెంలో సివిల్



జిఎం సూర్యనారాయణ ను,జిఎం హెచ్ఆర్డి రఘుపతి ని పలు విషయాల మీద కలిసిన ఆర్జీ త్రీ ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి.పోతన కాలని నుండి సెంటనరీ కాలనీకి వచ్చే నీటి పైప్లైన్,ఓసిపి-2 మెయిన్ రోడ్,సెంటనరీ కాలని నుండి గోదావరిఖని కి కోల్ కారిడార్ రోడ్డు గురించి సంప్రదించి త్వరగా ప్రాసెస్ పూర్తి చేయాలని వర్ష కాలం వస్తే పనులు చేయడం ఇబ్బంది అవుతుందని కోరడం జరిగింది,అదేవిధంగా సింగరేణి పరిసర ప్రాంతాల యువతకు స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు,అప్రెంటిస్ త్వరగా ప్రవేశపెట్టాలని కోరడం జరిగింది వీరి వెంబడి కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పితాంబరం, సత్యనారాయణ రెడ్డి ఉన్నారు.

## బిజెపి ప్రభుత్వంలో సామాన్యుడికి బతికే భారం..

**- పెంచిన గ్యాస్ ధరలు దించాలి...**
**- దినదినం ఆకాశాన్ని అంటుకున్న నిత్యవసర సరుకుల ధరలు...**
**- సిపిఐ మండల కార్యదర్శి సమ్మయ్య...**

**కరపత్రం శంకరపట్నం ఏప్రిల్ 8**

భారత దేశంలో బిజెపి ప్రభుత్వ హయంలో సామాన్యుడికి బతికే భారంగా ఉందని, నిత్యవసర సరుకులు దినదినం ఆకాశాన్ని దేశ ప్రజానీకం తీవ్రంగా ఆందోళన చెందుతుందని, సిపిఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆరోపించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గ్యాస్ ధరల పెంపుకు నిరసనగా భారీ నిరసన కార్యక్రమాన్ని జాతీయ రహదారిపై చేపట్టి ఆటోకు సిలిండర్ పెట్టి





తాలుకట్టి జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమయ మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం సామాన్యుడికి దినదినం బతికే భారంగా చేస్తుందని, భారతదేశంలో బిజెపి ప్రభుత్వ హయంలో సామాన్యుడికి తినడానికి తిండి లేకుండా నిత్యవసర సరుకులకు దినదినం రేట్లు పెంచుతూ, సామాన్యుడికి బతికే భారం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు, ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ మంత్రి వర్గము సామాన్య ప్రజానీకాన్ని దృష్టిలో పెట్టుకొని నిత్యవసర సరుకులు ధరలను అరికట్టి పెంచిన గ్యాస్ ధరను వెంటనే దించాలని డిమాండ్ చేశారు లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు సుంకరి కిషోర్, గోదారి లక్ష్మణ్, బిక్షపతి, మొగిలి, కుమార్, పోశయ్య, శ్రీనివాస్, మురళి, నరేష్ ,ఆటో యూనియన్ నాయకులు, యజమానులు కార్మికులు కర్షకులు తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట్ లో గంగాదేవి బీరన్న కొలుపు ఉత్సవాలు

**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఏప్రిల్ 08.**

రామగిరి మండలం బేగంపేట గ్రామంలో యాదవుల కులదైవమైన గంగాదేవి బిరన్న ఉత్సవాలు నేటి బుధవారం నుండి 17వ తారీకు గురువారం వరకు ఉంటాయని గొల్ల కురుమలు తెలిపారు.మండలంలోని ప్రజలందరూ వచ్చి ఈ యొక్క




పండుగను విజయవంతం చేయాలని,ప్రతి 9 సంవత్సరాలకు ఒకసారి ఈ పండుగను నిర్వహిస్తామని అన్నారు.ఈ పండుగకు వచ్చి గంగాదేవి బిరన్నను మొక్కుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.ఒగ్గుడోలు, చప్పుల్లతో వారం రోజులపాటు ఊరిలో పండగ వాతావరణం నెలకొంటుందని,భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఆ యొక్క దేవుళ్ళ కృప కటాక్షాలు పొందాలని,గొల్ల కురుమ యాదవ సంఘం నాయకులు తెలిపారు.

## రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి టిజి జెన్ కో ఉద్యోగుల అభినందనలు:

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**

రామగుండంలో 800 మెగావాట్ల కొత్త విద్యుత్ కేంద్రాన్ని స్థాపించేందుకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తీసుకున్న చొరవకు కృతజ్ఞతగా మంగళవారం ఉదయం స్థానిక గాంధీనగర్లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీజీ జెన్ కో (తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ) ఉద్యోగులు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు రామగుండంలో 800 మెగావాట్ల కొత్త విద్యుత్ కేంద్రాన్ని స్థాపించేందుకు తీసుకున్న చొరవకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రాజెక్టు రామగుండం



ప్రాంత అభివృద్ధికి, రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఎంతో మేలు చేస్తుందని ఉద్యోగులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీజీ జెన్ కో లో పనిచేస్తున్న పలువురు సీనియర్ ఇంజినీర్లు, సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ...."రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ అవసరం ఎంతగానో ఉందనీ ,రామగుండంలో ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయనీ ,అలాగే విద్యుత్ రంగంలో నూతన మైలురాయి అవుతుందనీ ,విద్యుత్ కేంద్ర స్థాపనకు కృషి చేసిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కి రామగుండం ప్రజల పక్షాన కృతజ్ఞతలు' అని తెలిపారు.ఇంత పెద్ద ప్రాజెక్టును రామగుండంలో ఏర్పాటు చేయడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. శాశ్వతంగా విద్యుత్ సమస్యలకు ఇది పరిష్కారం కావచ్చని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.